క్లుప్తంగా

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



చొప్పెల్లలో ఎంపీడీఓ రాజును సత్కరిస్తున్న మహిళలు

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళల ఉపాధి కోసం నిర్వహించిన ఆరు నెలల కుట్టుమెషీన్ శిక్షణను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎ.రాజు కోరారు. మండలంలోని చొప్పెల్ల రైతు సేవా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన కుట్టుమెషీన్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ శిక్షణ పొందిన మహిళలు అందరూ తమ కుటుంబ జీవనోపాధిని మెరుగుపరచుకోవాలని సూచించారు. అనంతరం కుట్టు శిక్షణ పొందిన మహిళలందరూ ఎంపీడీఓ రాజును సన్మానించారు. డీసీ చైర్మన్ మెర్ల గోపాల స్వామి, సర్పంచ్ దంగేటి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా కృషి



జనార్ధనస్వామి ఆలయ కమిటీ సభ్యులు

ఆలమూరు: స్థానిక శ్రీ, భూసమేత జనార్ధన స్వామి వారి ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామని పాలకమండలి సభ్యులు వ్యాఖ్యానించారు. స్థానిక ఆలయ ఆవరణలో బుధవారం తొలిసారిగా ఆలయంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి నరేంద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, అర్చకులు, దేవదాయ శాఖ అధికారులు పాల్గొని ఆలయ అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై సమీక్ష జరిపారు. ఐదు శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయంలో ఇకనుంచి ప్రతి శనివారం నాలుగు శనివారాలు, నాలుగు ప్రదక్షిణలు కార్యక్రమాన్ని చేపట్టడానికి తీర్మానం చేశారు. ప్రతి శనివారం భక్తుల సహకారంతో ప్రసాద వితరణతో పాటు తోమాల సేవ నిర్వహిస్తామని తెలిపారు. జనార్ధన స్వామి వైభవాన్ని వ్యాప్తి చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

క్రీడాకారుడికి సత్కారం



సఖినేటిపల్లిలో అభిషేక్‌ను సత్కరిస్తున్న కేఎస్ఎన్ రాజు

సఖినేటిపల్లి: గ్రామానికి చెందిన వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారుడు, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల స్థాయి సిల్వర్ మెడల్ గ్రహీత నల్లి అభిషేక్‌ను బుధవారం సఖినేటిపల్లిలో ప్రముఖులు ఘనంగా సత్కరించారు. స్థానిక మూడుతూములు సెంటర్‌లో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కేఎస్ఎన్ రాజు అభిషేక్‌ను సన్మానించారు. ఇటీవల అమలాపురం కేంద్రంగా కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పై పోటీల్లో సిల్వర్ మెడల్ ఆయన సాధించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ కొల్లాబత్తుల నాని, నాయకులు కుసుమ చంద్రశేఖర్, పాటి శివకుమార్, బళ్ళ నోబుల్ ప్రభాకర్, నల్లి రత్నకుమార్, తాడి సహదేవ్, రాపాక సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు



రామేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులతో సురేష్‌బాబు

సఖినేటిపల్లి: మండలంలో రామేశ్వరం, గొంది, అంతర్వేదికర తదితర గ్రామాల్లో జెడ్పీ, ప్రాథమిక పాఠశాలల వద్ద బుధవారం పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి దీపాటి సురేష్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పలు సమస్యలను ఆయన దృష్టికి ఉపాధ్యాయులు తీసుకువెళ్లారు. ఆర్థిక బకాయిలు చెల్లించాలని, పీఆర్సీ కమిటీని నియమించాలని కోరారని తెలిపారు. అలాగే ఆన్‌లైన్ వర్కులు తగ్గించమంటే అసెస్మెంట్ పుస్తకాలు, టీచర్ డైరీలు పేరుతో ఆఫ్ లైన్ పనిని పెంచారని తన దృష్టికి తెచ్చారన్నారు. వీటన్నింటినీ రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకువెళుతున్నట్టు సురేష్‌బాబు పేర్కొన్నారు. పంగం బ్రహ్మాజీరావు, పిల్లి హేమసుందర్‌రావు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధికి విఘాతం

- ఆటో కార్మికుల ఆవేదన
- ఆదుకోవాలని డిమాండ్

మామిడికుదురు: జీవనోపాధి కోల్పోయి తాము వీధిన పడ్డామని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం ఉచిత బస్సు ప్రయాణం తమ జీవనోపాధికి తీవ్ర ఆటంకంగా మారిందని కార్మికులు వాపోతున్నారు. గత నెల 15వ తేదీ నుంచి తమ పరిస్థితి దారుణంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తాము ఆటోలు నడపలేమని చెబుతున్నారు. ప్రభుత్వమే ఆటోలు కూడా స్వాధీనం చేసుకుని, అన్ని ఖర్చులు భరించి తమ జీవనానికి నెలకు సరిపడే విధంగా గౌరవ వేతనం ఇవ్వాలని ఆటో కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన దాని కన్నా రెట్టింపు ఆర్థికసాయం అందించి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు. లేని పక్షంలో తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ కార్మికులు ఆవేదన చెందారు.



నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు (ఫైల్)

మూడు నియోజకవర్గాల్లో 8 వేల మంది

పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో సుమారు ఎనిమిది వేల మంది ఆటో కార్మికులు ఈ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప మహిళలు ఎవరూ ఆటోలు ఎక్కడం లేదని ఆటో కార్మికులు చెబుతున్నారు. ఆధార్ కార్డు తీసుకుని మహిళలు బస్సుల కోసం వేచి చూస్తున్నారన్నారు. గతంలో రోజులు ఖర్చులు అన్నీ పోను రూ.600 నుంచి రూ.700 వరకు ఆదాయం వచ్చేదన్నారు. ప్రస్తుతం రూ.300 రావడం కూడా గగనం అవుతుందన్నారు. అన్ సీజన్లో అది కూడా రావడం లేదని మనోవేదన చెందారు. ఈ ఆదాయంతో తమ కుటుంబాలను పోషించుకోవడం ఎలా అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. తమకు ప్రభుత్వమే ఆర్థిక భరోసా కల్పించాలని వేడుకుంటున్నారు.

సబ్సిడీపై చార్జింగ్ ఆటోలు ఇవ్వాలి



మా పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. ఏం చేయాలో తెలియని అయోమయంలో ఉన్నాం. మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి. మమ్మల్ని ఆదుకునేందుకు సబ్సిడీపై చార్జింగ్ ఆటోలు అందించాలి. దీంతో పాటు గత ప్రభుత్వం ఇచ్చిన రూ.10 వేలు రెట్టింపు సహాయం అందించి తమకు భరోసా కల్పించాలి. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి.

– పితాని సురేంద్ర, రాజోలు తాలూకా యూనియన్ అధ్యక్షుడు

కార్మికులను ఆదుకోండి



ఆటో కార్మికులను ఆదుకునే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్నారు. కానీ దానిపై ప్రజాప్రతినిధులు మాట్లాడటం లేదు. దీన్ని రెట్టింపు చేయాలి. మా కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలి. మా పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోకపోతే మాకు ఆత్మహత్యలే శరణ్యం. దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచించాలి.

– పిల్లి వెంకటేశ్వరరావు, పి.గన్నవరం యూనియన్ అధ్యక్షుడు

ఆటోలు స్వాధీనం చేసేస్తాం



మా ఆటోలు ప్రభుత్వానికి స్వాధీనం చేసేస్తాం. మేము కూడా ఉచితంగా ఆటోలు నడుపుతాం. అన్ని ఖర్చులు ప్రభుత్వం భరించి మాకు నెలకు సరిపడే విధంగా గౌరవ వేతనం ఇవ్వాలి. 50 ఏళ్లు నిండిన ప్రతి ఆటో కార్మికునికి పింఛన్ అందించాలి. ఆటో కార్మికులను ఆదుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే ఆలస్యం జరిగింది. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలి.

– గంటి రత్నంరాజు, రాజోలు తాలూకా ఆటో యూనియన్ అధ్యక్షుడు



అంబాజీపేటలో మాట్లాడుతున్న కంపెనీ చైర్మన్ రాఘవులు

'బయోచార్'తో సత్ఫలితాలు

అంబాజీపేట: బయోచార్ ఎరువుతో భూమిలో సేంద్రియ కర్బనాన్ని వేగంగా పెంచి సత్ఫలితాలను ఇస్తుందని రైతులు దీనిని వినియోగిస్తే మంచి లాభం పొందవచ్చని కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈవో అడ్డాల గోపాలకృష్ణ సూచించారు. అంబాజీపేటలోని కృషివల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆరో మహాజనసభ కంపెనీ చైర్మన్ గణపతి వీరరాఘవులు అధ్యక్షతన బుధవారం జరిగింది. సీఈఓ గోపాలకృష్ణ మాట్లాడుతూ బయోచార్ ఎరువు వలన భూమిలో సేంద్రియ కర్బనాన్ని పెంచడానికి కావలసిన బొగ్గు పొడి, సూక్ష్మజీవుల చర్య అభివృద్ధి చెందడానికి ఉపయోగపడుతుందన్నారు. పంటలను నాశనం చేసే పురుగులను నివారించేందుకు కంపెనీలో స్వయంగా తయారు చేసిన వేప పిండిని వాడి పంటలను సంరక్షించుకోవాలన్నారు. అయినవిల్లి మండలం నేదునూరులో ఉన్న కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీలో రైతులకు అమ్మేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. అంతకు ముందు చైర్మన్ వీరరాఘవులు మాట్లాడుతూ స్థూల, సూక్ష్మ పరిశ్రమల నిర్వహణ శాఖ (ఎంఎస్ఎంఈ) ద్వారా కంపెనీకి విడుదలైన గ్రాంటు రూ.3.19 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను సభ్యులకు వివరించారు. పీచు పరిశ్రమ, ఐదు కేజీల కోకో బ్రిక్స్ పరిశ్రమ, ప్లాట్‌ఫారం నిర్మాణం, రహదారి నిర్మాణం, కోకో ప్రాసెసింగ్ యూనిట్, నర్సరీ మొదలైనవి ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం ఇటీవల అంబాజీపేట, ఐరుసుమండ, శానపల్లిలంక సొసైటీల త్రీ సబ్జెక్ట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అరిగెల సూరిబాబు, సుంకర గణపతిరావు, యాళ్ల ఆనందరామయ్యలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బొంతు పెదబాబు, బొక్కా ఆదినారాయణ, ముత్యాల జమ్మీలు, ఉప్పుగంటి భాస్కరరావు, గోదసి నాగేశ్వరరావు, మాకిరెడ్డి పూర్ణిమ, వేగేసం సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి రూ.21 కోట్లు విడుదల

పి.గన్నవరం: ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజల రాకపోకల కోసం వశిష్ట నదీ పాయపై నిర్మిస్తున్న వంతెనకు ప్రభుత్వం రూ.21 కోట్లు విడుదల చేసింది. వంతెన నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం కింద రూ.2.3 కోట్లు విడుదల చేశారు. ఈ విషయాన్ని పి.గన్నవరంలో బుధవారం విలేకరుల ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ వెల్లడించారు. 20 రోజుల్లోగా రైతుల ఖాతాల్లో నష్టపరిహారం సొమ్ము రూ.2.3 కోట్లు జమ అవుతాయన్నారు. గతంలో వరద బాధితులను పరామర్శించేందుకు ఇక్కడికి వచ్చిన అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లంక గ్రామాల ప్రజల కష్టాలను తెలుసుకుని రూ.49.5 కోట్లతో ఈ వంతెన నిర్మాణానికి అనుమతులు ఇచ్చి పనులు ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే అంచనా వ్యయం పెరగడంతో దాన్ని రూ.71.3 కోట్లకు పెంచుతూ రివైజ్డ్ అడ్మినిస్ట్రేషన్ శాంక్షన్ (ఆర్ఏఎస్) ఇస్తూ ప్రస్తుత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

మృతుల కుటుంబాలకు పరామర్శ



మృతురాలి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు

అంబాజీపేట: ఇటీవల పుల్లేటికుర్రు, అంబాజీపేటల్లో మృతి చెందిన ఇద్దరు కుటుంబాల సభ్యులను పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు బుధవారం పరామర్శించారు. పుల్లేటికుర్రు నల్లావారిపేటలో కాగిత అర్జివేణి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె కుమారుడు రాజీవ్‌ను పరామర్శించారు. అలాగే అంబాజీపేటలో పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ మేడిద రంగా జానకీ ప్రసాద్ (చిన్న) మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి పవిత్ర ఆత్మకు శాంత చేకూరాలని చిత్రపటాల వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, వడలి కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

బ్రోమోడయోలిన్ మందు పంపిణీ

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం సామూహిక ఎలుకల నిర్మూలన కోసం బ్రోమోడయోలిన్ మందు పంపిణీ జరిగింది. ఆలమూరు ఏడీఏ సీహెచ్ కేవీ చౌదరి, మండల వ్యవసాయాధికారి బి.మీనా ఆధ్వర్యంలో ఆయా గ్రామ సచివాలయాల వద్ద క్షేత్రస్థాయి వ్యవసాయ గ్రామ సహాయకులు ఆయా గ్రామాల వరి రైతులకు ఈ బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేశారు. మోదుకూరులో జరిగిన పంపిణీలో ఏడీఏ చౌదరి పాల్గొని ప్రసంగించారు. రైతులందరూ సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టడం ద్వారా చక్కని ఫలితాలను సాధించవచ్చన్నారు. ఏవో మాట్లాడుతూ వరి పొలం ప్రస్తుతం దుబ్బు దశ నుంచి ఈనిక దశకు చేరుతుందన్నారు.



మోదుకూరులో ఎలుకల నిర్మూలనకు బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేస్తున్న ఏడీఏ

ఈ సమయంలో అధిక నష్టాన్ని కలగజేసే ఎలుకల నిర్మూలన చేపట్టాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహారాజు గణపతిగా విఘ్నేశ్వరుడు



మహారాజు గణపతి అలంకరణలో మాడవీధుల్లో ఊరేగుతున్న విఘ్నేశ్వరస్వామి



మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని సత్కరిస్తున్న గ్రామస్తులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మాడవీధుల్లో మహారాజు గణపతి ఆలంకరణలో బుధవారం ఊరేగారు. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామిని వివిధ పుష్పాలతో ప్రత్యేకించి అలంకరించారు. సాయంత్రం స్వామి మాడవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. స్వామికి సాయంత్రం పంచహారతులు ఇచ్చారు. స్వామిని దర్శించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి ఆలయంలో నవరాత్రుల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిషనర్, ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు జరిపారు.

విభూది అలంకరణలో వరసిద్ధి వినాయకుడు

అంబాజీపేట: మాచవరం కోటివారి అగ్రహారంలో వేంచేసిన వరి సిద్ధి వినాయకుడు బుధవారం విభూది అలంకరంలో భక్తులకు దర్శనమిచ్చారు. అగ్రహారంలో ఉన్న భువనేశ్వరి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఉన్న వినాయకుని అర్చకులు డి.ప్రవీణ్ శర్మ మంచి విభూదితో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని పెనికేరులో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మేకా సత్యం గోదాము సమీపాన ఏర్పాటు చేసిన సిద్ధి వినాయక మండపంలో తొమ్మిదో వార్షికోత్సవం జరిగింది. ఆ ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గణపతి మండపాన్ని సందర్శించారు. గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గణపతి మండపంలో వేద పండితుల మంత్రోచ్చారణల మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు పూలమాలలు, శాలువా వేసి ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అలాగే ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో ఆయన పాల్గొని గ్రామ పెద్దలతో కలసి సహపంక్తి భోజనం చేశారు.

అన్నసమారాధన

అంబాజీపేట: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని అంబాజీపేట మండలంలో వినాయకుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కె.పెదపూడి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, ఇసుకపూడి, చిరతపూడి, ముక్కామల తదితర గ్రామాల్లో చవితి పందిళ్ల వద్ద భారీ అన్న సమారాధన చేపట్టారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: గణపతి నవరాత్ర మహోత్సవ ముగింపు సందర్భంగా పి.గన్నవరం వార్ఫ్ సెంటర్‌లోని ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం భక్తులకు భారీ అన్న సమారాధన చేశారు. అలాగే స్థానిక పితాని వారిపాలెం యూత్ ఆధ్వర్యంలో భక్తులకు భారీ స్థాయిలో అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాలకు ఆయా కమిటీల సభ్యులు ఆధ్వర్యం వహించారు.

అలరించిన నాటక ప్రదర్శన

కొత్తపేట: వాడపాలెం పాత మార్కెట్ వీధి గణపతి నవరాత్ర ఉత్సవ పందిరిలో మంగళవారం రాత్రి సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా అలరించింది. ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్ గనిశెట్టి చంద్రశేఖర్, సభ్యులు బండారు భాస్కరరావు, కురచ వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ తారాగణంతో పౌరాణిక రంగస్థల నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. హరిశ్చంద్రుడిగా డీవీ సుబ్బారావు (ప్రకాశం జిల్లా వేట్లపాలెం), చంద్రమతిగా కిలారి లక్ష్మి (విజయనగరం జిల్లా, రాజాం), నక్షత్రకునిగా భీమవరం వాసు, విశ్వామిత్రుడు, కాలకౌశికుడు, వీరబాహుడుగా ముళ్లపూడి రామచంద్రరావు,



వాడపాలెంలో సత్యహరిశ్చంద్ర వారణాసి ఘట్టంలో జూ.డీవీ, కిలారి లక్ష్మి, వాసు

మొదటి హరిశ్చంద్రుడిగా టి.నాగేశ్వరరావు తదితరులు తమ నటనా కౌశలాన్ని ప్రదర్శించారు. కళాభిమానులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి బుధవారం ఉదయం వరకూ ప్రదర్శనను తిలకించారు.

నిస్వార్థ సేవలు అభినందనీయం

రావులపాలెం: సేవకు అసలైన అర్థంగా నిలవడంతో పాటు నిస్వార్థంగా సేవ చేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు అభినందనీయులని, వారి సేవను రాష్ట్ర గవర్నర్ గుర్తించి రాజ్‌భవనలో ఎట్ హోమ్‌కు ఆహ్వానించడం వారి సేవకు దక్కిన అరుదైన గౌరవమని డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక వేమన రెడ్డి కల్యాణ మండపంలో బుధవారం సంస్థ మూడో వార్షికోత్సవాన్ని సేవా కార్యక్రమాలతో అత్యంత అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి జగ్గిరెడ్డి, సీఆర్‌సీ రూప శిల్పి, మాజీ సర్పంచ్ గొలుగూరి వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గత మూడేళ్ల నుంచి



అనారోగ్య బాధితుడి వైద్యానికి సాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

తాము కూడా సేవా సంస్థలో సభ్యులుగా ఉండటంతో పాటు సంస్థ చేస్తున్న సేవకు తమ సహకారాన్ని అందించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో తమ సహకారం ఉంటుందని సభ్యులు మరింతగా సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. సంస్థను నడిపిస్తున్న పలువురిని సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం కాకినాడ జిల్లా కరప మండలం వేములవాడకి చెందిన గుత్తుల శివకృష్ణకికి తలలో రక్తం గడ్డ కట్టి ఆపరేషన్ జరిగి వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న అనారోగ్య బాధితునికి రూ.11,500 చెక్కును సంస్థ ద్వారా జగ్గిరెడ్డి అందజేశారు. అనంతరం 60 మంది నిరుపేద వృద్ధులకు రూ.75 వేల విలువైన కిట్లను ఒక్కొక్కరికి దాదాపు రూ.1500 విలువైన నిత్యావసరాలు, చీరలు, పండ్లతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. అలాగే స్థానిక బ్రైట్ లైట్ అంధుల ఆశ్రమానికి రూ.60 వేలు విలువైన మంచాలను సత్యసాయి విద్యాసంస్థల డైరెక్టర్ రవిచంద్ర చేతుల మీదుగా అందజేశారు.

మొండి బకాయిలపై స్పెషల్ డ్రైవ్

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో 74 షాపులతో ఉన్న అతి పెద్ద షాపింగ్ కాంప్లెక్స్ (సర్క్యులర్ బజార్), మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌లపై మున్సిపల్ రెవెన్యూ విభాగం అధికారులు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సర్క్యులర్ బజార్‌లో రూ. 50 వేలు దాటి అద్దె బకాయిలు పడిన షాపులు 26 ఉన్నాయి. ఈ షాపులకు తాళాలు వేసేందుకు మున్సిపల్ రెవెన్యూ అధికారి భూపతి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రయత్నించారు. అయితే 26 షాపులకు గాను 12 షాపుల లీజుదారులు అప్పటికప్పుడే బకాయిలు చెల్లించారు. మిగిలిన 14 షాపులకు తాళాలు వేసి సీజ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ కూడా సర్క్యులర్ బజార్‌ను సందర్శించి అద్దె బకాయిలు ఉన్న లీజుదారులతో మాట్లాడారు. సర్క్యులర్ బజార్‌లో 12 మంది లీజుదారులు మొండి బకాయిలు చెల్లించడంతో అక్కడే రూ.4.15 లక్షలు వసూలు చేశారు. అలాగే మార్కెట్‌లో 27 షాపులతో కాంప్లెక్స్ ఉంది. ఈ షాపుల్లో రూ.50 వేలు దాటి అద్దెల బకాయిలు ఉన్న షాపులు 4 ఉన్నాయి. అధికారులు స్పెషల్ డ్రైవ్‌కు వెళ్లగానే ఈ నాలుగు షాపుల లీజుదారులు రూ.1.54 లక్షలు అద్దె బకాయిలు చెల్లించారు. స్పెషల్ డ్రైవ్‌లో రెండు షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో మొత్తం రూ.5.69 లక్షల మొండి బకాయిలు వసూలైనట్లు రెవెన్యూ అధికారి శ్రీలక్ష్మి తెలిపారు. సర్క్యులర్ బజార్‌లో మరుగుదొడ్ల సౌకర్యం లేదని, పలు చోట్ల లీకులు అవుతున్నాయని, అయినా మున్సిపాలిటీ అద్దెలను ముక్కు పిండి వసూలు చేస్తోందని పలువురి లీజుదారులు కమిషనర్‌కు వివరించారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ చేతివృత్తుల విభాగం అధ్యక్షుడిగా మానేపల్లి గణపతిని నియమించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగిందని తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొంది.

ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడిగా రంగరాజు

మలికిపురం: వైఎస్సార్ సీపీ రాజోలు నియోజకవర్గ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడిగా రుద్రరాజు రంగరాజును నియమించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది.

కాజ్‌వేల పై కొనసాగుతున్న వరద



ముక్తేశ్వరం-అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం వద్ద కాజ్‌వేపై రాకపోకలు కొనసాగిస్తున్న లంక ప్రజలు



అప్పనపల్లి కాజ్‌వేపై వరద నీటిలో రాకపోకలు

అయినవిల్లి: గోదావరి ఉధృతి తగ్గడంతో లంక గ్రామ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ముక్తేశ్వరం-అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం వద్ద కాజ్‌వే పై వరద తగ్గడంతో యథావిధిగా రాకపోకలు ప్రారంభమయ్యాయి. ప్రయాణికులు తమ ప్రయాణాలను కొనసాగిస్తున్నారు. గురువారం నాటికి కాజ్‌వేపై పూర్తిగా వరద తగ్గుతుందని స్థానికులు చెబుతున్నారు. లంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో పంటలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయి. లంక గ్రామాల్లో రైతులు యథావిధిగా తమ పనుల్లో నిమగ్నమయ్యారు. పాడైన తమ పంట చేలకు ప్రభుత్వం నష్ట పరిహారం మంజూరు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

అప్పనపల్లిలో..

మామిడికుదురు: గోదావరి వరద క్రమక్రమంగా తగ్గుతోంది. అప్పనపల్లి కాజ్‌వేపై ఇంకా వరద నీరు ప్రవహిస్తోంది. దీనిపై రెండడుగుల మేర వరద ప్రవహించడంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజాలు వరద నీటిలోనే తీవ్ర ఇబ్బందుల మధ్య రాకపోకలు సాగిస్తున్నారు. ధవళేశ్వరంలో గోదావరి వరద తగ్గుముఖం పట్టినా ఇక్కడ మాత్రం నెమ్మదిగా శాంతిస్తోంది. గురువారం నాటికి కాజ్‌వే వరద నీటి నుంచి బయటపడే అవకాశం ఉందని భావిస్తున్నారు. వరద తగ్గడంతో అప్పనపల్లి కాజ్‌వేపై నిలిపివేసిన రాకపోకలు బుధవారం నుంచి పునరుద్ధరించారు. ఆర్టీసీ బస్సుతో పాటు ఇతర వాహనాలు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు.